

కమలాపురం ఎంపిడిఓగా గౌస్‌బాషా



ప్రజాశక్తి- కమలాపురం టౌన్

కమలాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా గౌస్ బాషా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఓ జ్యోతి నంద్యాలకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఒంటిమిట్ట నుంచి గౌస్ బాషా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురం రావడం నాకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎంపిడిఓ గౌస్‌బాషాను కార్యాలయ సిబ్బంది అభినందించారు.

మున్సిపల్ కార్మికుల పిల్లలకూ

తల్లికి వందనం వర్తింపజేయాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

మున్సిపల్ కార్మికుల పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నగర అధ్యక్షులు సుంకర రవి కోరారు. శనివారం నగరంలోని పాత మున్సిపల్ ఆఫీస్ దగ్గర నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం ప్రారంభించారని పేర్కొన్నారు. సుమారు రూ.10,098 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించారని తెలిపారు. రాష్ట్రంలో 48 వేల మంది మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికుల పిల్లలకు తల్లికి వందనం నిధులు జమ కాకపోవడం కార్మికులందరినీ తీవ్ర అసంతృప్తికి గురిచేసిందని చెప్పారు. పారిశుధ్య కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేస్తామని కోరారు. ఇంజినీరింగ్ కార్మికులు చాలీచాలని వేతనాలతో బతుకుతున్న తమ కుటుంబాలకు కూడా సంక్షేమ పతకాలు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలకు మొరపెట్టు కుంటున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలుచేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారని చెప్పారు. ఆచరణలో వచ్చేటప్పటికి అందుకు భిన్నంగా మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీ, ఆశ తదితర కార్మికుల పిల్లలకు మొండిచేయి చూపారని పేర్కొన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి స్పందించి మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులతోపాటు స్కీం వర్కర్లందరికీ కూడా తల్లికి వందనంతో



పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

పాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలని వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయాని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సంక్షేమ పథకాలు మునిసిపల్ కార్మికుల కుటుంబ సభ్యులకు వర్తింప చేయకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నగర సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్, డ్రైవర్ యూనియన్ కార్యదర్శి సుంకర కిరణ్, నగర నాయకులు నాగరాజు, సి.పి.అరుణ్, హరి, రవి, నరసింహులు, రాజా, హజరత్, నవకాంత్, సుబ్బరాయుడు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'తల్లికి వందనం'లో నిబంధనలు సరికాదు



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, రవి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా తల్లికి వందనం పథకం పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి అన్నారు. శనివారం కోటిరెడ్డి సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో రాష్ట్రంలో కుటుంబంలో ఒకటి నుంచి 12 వరకు తరగతి చదువుతున్న ఎంత మంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మాట తప్పడం సిగ్గుచేటని చెప్పారు. 2024-25 సంవత్సరం సంబంధించి తల్లికి వందనం పథకం బురుడి కొట్టించి తల్లిదండ్రులు మోసం చేశారని విమర్శించారు. ప్రస్తుతం 2025-26 సంవత్సరం సంబంధించి రూ.15 వేల ఇస్తామని తల్లుల అకౌంట్ లోకి రూ.13 వేలు జమ చేసి రూ.2 వేలు స్కూళ్ల, కాలేజీల అభివృద్ధి పనుల కోసం మినహాయించినట్లు చెప్పడం సిగ్గుచేటన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఖాతాలో వేస్తామని ప్రభుత్వం ప్రకటించడం చూస్తుంటే వారే ఇచ్చి వారే లాక్కుంటే ఇవ్వడం దండగన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ బడులలో చదువుతున్న విద్యార్థుల వద్ద వసూలు చేసే డబ్బును ఆ విద్యా సంస్థల అభివృద్ధి ఉపయోగిస్తుందా అంటే ప్రయివేట్, కార్పొరేట్ బడులను అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వానిదా అని ఎద్దేవా చేశారు. అనేక అసంబద్ధ నిబంధనల పేరుతో విద్యార్థుల సంఖ్యను కుదింపు చేయడానికి ఖండిస్తున్నామని తెలిపారు. విద్యుత్ 300 యూనిట్లు వినియోగిస్తే అర్హులు కారు అనే నిబంధనలను గతంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు వ్యతిరేకించారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇదే నిబంధనలను కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఫోర్ వీలర్ వెహికల్ నిబంధనలను తీసివేయాలని డిమాండ్ చేశారు. ఒక కుటుంబంలో పాఠశాల డిగ్రీ చదివే విద్యార్థులు ఉంటే ఒకరికి మాత్రమే ఏదైనా పథకం వర్తిస్తుందని, ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు ఫీజు రియంబర్స్మెంట్ కి లింకు పెట్టడం సరికాదని పేర్కొన్నారు. ఏదైతే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా రూ.15 వేలు చొప్పున ఇవ్వాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, రోని,మోహన్, నగర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు ఖాసిం పీర్, శ్రీకాంత్, కిషోర్ పాల్గొన్నారు.

16న కలెక్టరేట్ ఎదుట ధర్నా : సిఐటియు

ప్రజాశక్తి-కడప అర్బన్

తల్లికి వందనం పథకం ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఆప్కాస్, అంగన్వాడీ, మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు కార్యాలయంలో నగర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని తెలిపారు. సమస్యలు పరిష్కారం చేయడంలో గత ప్రభుత్వాలు ఏ విధానాలు అమలు చేశాయో ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అవే విధానాలు అమలు చేస్తున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఆప్కాస్, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు, అంగన్వాడీ, ఆశ అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ఎవరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కాకుండా ఉండేవి పేర్కొన్నారు. ఇప్పుడు అధికారంలో ఉండే పెద్దలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేము అధికారంలోకి వస్తే రూ.25 వేలు వేతనం కన్నా తక్కువ ఎవరైతే తీసుకుంటున్నారో వారందరికీ మేం అధికారంలోకి వస్తానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు అందే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవి ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు అందడం లేదని చెప్పారు. ప్రధానంగా అంగన్వాడి రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఆయా కు రూ.7000 టీచర్‌కు రూ.11,500 వేతనం మాత్రమే ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. వీరు కూడా ప్రభుత్వ పథకాలకు నోచుకోని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మీరంతా ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి, మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎస్.గోపి, జిల్లా సహాయ కార్యదర్శి ఆనందరావు, బ్రహ్మానందరెడ్డి, మెడికల్ యూనియన్ నాయకులు మహేష్, పవన్, కార్మికులు పాల్గొన్నారు.

చిత్తూరు, అనంతపురం జట్ల ఘన విజయం

ప్రజాశక్తి - కడప

సౌత్‌జోన్ ఎసిఎ అండర్-19 వన్డే క్రికెట్ టోర్నీలో శనివారం జరిగిన మ్యాచుల్లో చిత్తూరు, అనంతపురం జట్లు ఘన విజయం సాధించాయి. ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై 110 పరుగుల తేడాతో చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 46.2 ఓవర్లలో 237 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సి.సోహన్‌రెడ్డి అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించాడు. 119 బంతులను ఎదుర్కొని 15 బౌండరీల సహాయంతో 110 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని భార్గవ్ మహేష్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. తోషిత్ యాదవ్ 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 238 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 31.5 ఓవర్లలో 127 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమిని చవిచూసింది. ఆ జట్టులోని షావుల్ హమీద్ 60 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని ధనుష్‌రెడ్డి 4 వికెట్లు తీసుకున్నాడు. **కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో** జరిగిన వేరొక మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 110 పరుగుల తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు 50.0 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 283 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఎస్. రెహాన్ బ్యాటింగ్ లో అదుతేంగా రాణించాడు. 104 బంతులను ఎదుర్కొని 16 బౌండరీలు, 2 సిక్సర్ల సహాయంతో 117 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని నౌసున్ కళ్యాణ్ 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 284 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు 31.3 ఓవర్లలో 173 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమిని చవిచూసింది. ఆ జట్టులోని కె.వి.ఓంకార్ 57 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని నిశ్చయ్ అదుతేంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ సాయి ప్రతాప్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు.



తలపడుతున్న చిత్తూరు, నెల్లూరు జట్లు

యుపిఎస్‌సి సాధించడమే లక్ష్యం : వెంకట లీలాధర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇటీవల విడుదలైన ఎస్ఎస్‌సి, ఎస్‌సిసిజిఎల్ ఫలితాల్లో వెంకట లీలాధర్ విజయ కేతనం ఎగురవేశారు. కొచ్చిన్‌లో జిఎస్‌టి ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సాధించారు. కడప నగరానికి చెందిన వెంకట లీలాధర్ విద్యాభ్యాసం 10వ తరగతి వరకు కడపలో కొనసాగింది. ఇంటర్మీడియట్ ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల గుంటూరులో పూర్తి చేశారు. ఎంపిసిలో 981 మార్కులు వచ్చాయి. రాష్ట్ర స్థాయిలో ర్యాంక్ సాధించారు. చిన్నప్పటి నుంచి చదువుతోపాటు వివిధ రకాల పోటీలలో పాల్గొనేవాడు. వక్తృత్వ పోటీలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచేవారు. అప్పటి డిఇఒ అంజయ్య చేతుల మీదుగా స్కూల్ టాపర్ అవార్డు అందుకున్నారు. హైదరాబాదులో జరిగిన అంతర్జాతీయ చిల్డ్రన్స్ ఫెస్టివల్‌లో కడప జిల్లా తరపున పాల్గొన్నాడు. ఇంటర్మీడియట్ అనంతరం జెఇఇ మెయిన్స్‌లో ర్యాంక్ సాధించారు. హైదరాబాదులో సీటు వచ్చిన కుటుంబ ఆర్థిక స్తోమత సరిగా లేనికారణంగా జెఎన్‌టియు అనంతపురం ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో ఇఇఇలో చేరి గోల్డ్‌మెడల్ సాధించాడు. ఇంజినీరింగ్ పూర్తిచేసిన తరువాత ఆంధ్రబ్యాంక్, రైల్వేలో ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. సివిల్స్‌పై శ్రద్ధ ఉండడంతో ఆర్థిక అవసరాల దృష్ట్య జిఎస్‌టి ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరాడు. యుపిఎస్‌సిలో విజయం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పాడు. తాను ఈ స్థాయికి ఎదగడానికి ప్రయివేట్ కళాశాలలో పనిచేస్తున్న నా తండ్రి ఎస్.శ్రీనివాస వరప్రసాద్, తల్లి వనజ కారణమని చెప్పాడు.




వెంకట లీలాధర్

వంద రోజుల పని దినాలు కల్పించండి

- వ్య.కా.స జిల్లా కార్యదర్శి అన్వేష్

ప్రజాశక్తి-అట్లూరు

జిల్లాలో ఉపాధి కార్డు ఉన్న ప్రతి కార్మికుడికి వంద రోజుల పనిదినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు దుర్గమ్మ, రమణయ్య అన్నారు. శనివారం మండలంలోని కమలకూరు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధి కూలీలు పనిచేసే వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వేతనాలు 15 రోజుల లోపల ఇవ్వాలని.. ఆ తర్వాత వడ్డీతో కలిపి ఉపాధి కూలీలు వేతనాలు పంపిణీ చేయాలని.. ఇది చట్టం చెప్తున్న మాట అది అమలు అయ్యే విధంగా అధికారులు కూడా సహకరించాలని వారికి విజ్ఞప్తి చేశారు. సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని.. పనిముట్లు, మెడికల్ కిట్టు టెంటు ఇవ్వాలని చట్టం చెప్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తున్నారన్నారు ఉపాధి కూలీలు ఐక్యంగా నిలబడి ఉపాధి పథకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీమీద ఉందని పేర్కొన్నారు. కమలకూరు గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనులు కేవలం నాలుగు వారాలు మాత్రమే పనులు కల్పించారని తెలిపారు. వంద రోజులు పూర్తిగా పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వర్షాలు కురుస్తుండటంతో సకాలంలో పనులు కల్పించడంలో ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంగా వివరించారని పేర్కొన్నారు. వంద రోజుల పని కల్పించకపోతే జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కార్యాలయాల ఎదట ఆందోళనలు చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. జిల్లా ఉన్నతాధికారులు, మండల కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు రవిచంద్ర, సుభద్రమ్మ, సుభాషిని, సుమలత, కృష్ణవేణి, చంద్రమ్మ, జానకమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వి.అన్వేష్

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్



మాట్లాడుతున్న మనోహర్

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

జిల్లా వ్యాప్తంగా, జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ జిల్లా అధికారులను కోరారు. శనివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నదని తెలిపారు. జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో శానిటేషన్ కార్మికులకు మూడు నెలలు దాటి నాలుగు నెలలు అవుతున్నా వేతనాలు రాకపోవడం అన్యాయమని చెప్పారు. అప్పులు తెచ్చుకున్నా సరిపోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జిఒ నెంబర్ 549 ప్రకారం రూ.16 వేలు వేతన ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.11,800 మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. అడిగితే బెదిరించడం దుర్మార్గమని ఆగ్రహ్యం వ్యక్తం చేశారు. రూ.16 వేలు ఇవ్వాల్సిన డబ్బులు రూ.11,800 ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ డబ్బులు కాంట్రాక్టర్ కాజేసి కొల్లగొట్టడం సరైనది కాదని తెలిపారు. ఇఎస్ఐ, పిఎఫ్ అప్డేట్ కట్టడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా వీక్లీ ఆఫ్‌లు ఇవ్వకపోవడం, క్యాజువల్ సెలవులు ఇవ్వకపోవడం సరైనది కాదని తెలిపారు. 100 పడకల ఆసుపత్రికి కేవలం 14 మంది మాత్రమే పనిచేయడం వల్ల కార్మికులకు అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తారు. కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటూ, వేతనంలో కోత కోస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శరత్ అనే కాంట్రాక్టర్ కార్మికుల బాధలు పట్టించుకోకుండా, కార్మికుల సొమ్మును దోచుకుంటున్న శరత్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు ఏసుదాసు ఆస్పత్రి, శానిటేషన్ గౌరవాధ్యక్షులు వినయ్ కుమార్ పాల్గొన్నారు.



ర్యాంకు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్లు

నీట్ ఫలితాల్లో 'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎన్‌టిఎ ప్రకటించిన నీట్-2025ఫలితాలలో కడప శ్రీ చైతన్య కళాశాలలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని సుష్మశ్రీ, నాగేంద్ర కుమార్ తెలిపారు. ఆల్ ఇండియా అన్ని క్యాటగిరీలలో హృతిక 14,849వ ర్యాంకు, అన్నికారెడ్డి 23,619వ ర్యాంకు, సునంద 46,756వ ర్యాంకు, సత్య 51,417వ ర్యాంక్ సాధించారని పేర్కొన్నారు. చాలా మంది విద్యార్థులు నీట్ పరీక్షలో అర్హత సాధించి కళాశాల కీర్తి ప్రతిష్టలు అత్యున్నత స్థాయికి తీసుకెళ్లారని తెలిపారు. పోటీ పరీక్షలలో టాప్ ర్యాంకుల సాధన ధ్యేయంగా కృషి చేస్తూ ఆలిండియా పరీక్షల సాధనలో కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించడం శ్రీ చైతన్య విద్యా సంస్థ విశిష్ట ప్రణాళిక ఉత్తమ మెటీరియల్స్, అధ్యాపకుల నిరంతర కృషి, ప్రోత్సాహం అన్నారు. ఇంతటి ఘనత సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని శ్రీచైతన్య తిరుపతి డివిజన్ ఎజిఎం బి.వి.ప్రసాద్, డీన్ కెఎల్‌జి ప్రసాద్, ప్రిన్సిపల్స్ నాగరాజు, ప్రవీణ్, పరమేశ్వర్ రెడ్డి, శివప్రసాద్, అడ్మిన్ ఆఫీసర్ మనోజ్, మల్లికార్జున స్వామి అభినందించారు.

నారాయణ కళాశాల విద్యార్థుల ప్రతిభ : నీట్ పోటీ పరీక్షల్లో నారాయణ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారని కళాశాల డిజిఎం రామ మోహన్‌రెడ్డి, డీన్ చంద్ర కిషోర్‌రెడ్డి తెలిపారు. పల్లవి 743, రమ్య సాయి 16,344, జోషిని 18562, మహమ్మద్ అమీన్ 19,986 ర్యాంకులు సాధించారిని తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని బుచ్చర్ స్ట్రీట్‌లో మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ మోడల్ ఉర్దూ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.సికిందర్ బాషా కోరారు. శనివారం బుచ్చర్ స్ట్రీట్ పరిధిలో బడి బాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన, విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందిస్తున్నారని తెలిపారు. అనుభవం, ఉన్నతమైన ఉపాధ్యాయులతో మెరుగైనా విద్య అభ్యాసన అందుతుందని చెప్పారు. ఎస్‌టియు జిల్లా కార్యదర్శి ఎస్.నజీబుల్లా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పైసా ఖర్చు లెకండా గుణాత్మక విద్య, స్కూల్ యూనిఫామ్, బుక్స్, నోటుబుక్స్, షూస్, స్కూల్ బ్యాగ్, మంచి ఆరోగ్యమైన ఎన్విరాన్మెంట్, స్టూడెంట్ కిట్‌తో పాటు మధ్యాన భోజనం ఉచితంగా అందుతున్నారు. ప్రయివేట్ స్కూల్ మోజులో పడి వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో సచివాలయ యానిమేటర్ నిజాం, ఉపాధ్యాయులు ఎస్.జామిల్, నాయబ్ రసూల్, విద్యార్థులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

ఏడాది పాలన అంతా మోసం : వైసిపి

ప్రజాశక్తి- కమలాపురం టౌన్

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అంతా మోసపూరితమని వైసిపి కమలాపురం ఇన్‌ఛార్జి నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తయినా ఇచ్చిన హామీల్లో సంవత్సర కాలంలో తల్లికి వందనం తప్ప ఏ ఒక్క హామీ అమలు లేదని విమర్శించారు. గత ప్రభుత్వ అప్పు చేసి పథకాల అమలు చేస్తోందని ఎద్దేవా చేసిన చంద్రబాబు ఇవాళ తల్లికి వందనం పథకం అమలుకు కూటమి ప్రభుత్వం రూ.14 కోట్ల అప్పు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తానన్న చంద్రబాబు సంపద సృష్టి లేదని తేటతెల్లమైందని తెలిపారు. తల్లికి వందనం పథకానికి అర్హులు 87 లక్షల మంది విద్యార్థులు ఉంటే కేవలం 67 లక్షల మందికి ఇచ్చి 20 లక్షల మందికి విద్యార్థులకు ఇవ్వలేమని కూటమి ప్రభుత్వం చేత్తులెత్తేసిందని విమర్శించారు. ప్రభుత్వ స్కూళ్లను ప్రయివేట్ స్కూళ్లకు దీటుగా బలోపేతం చేసిన జగన్ ప్రభుత్వ స్కూల్లో ఇంగ్లీష్ మీడియం, సిబిఎస్‌ఇ సిలబస్‌ను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కూటమి ప్రభుత్వం సిబిఎస్ఇ సిలబస్‌ను ఇంగ్లీష్ మీడియం తొలగించి ప్రయివేటు స్కూళ్లను ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో మూడు పథకాలు అమలు చేయలేమని చంద్రబాబు పరోక్షంగా తెలిపారన్నారు. జగన్ ప్రభుత్వం 50 లక్షల మంది విద్యార్థులకు అమ్మబడి ఇస్తే, టిడిపి ప్రభుత్వం 65 లక్షల మందికి ఇవ్వబోతోందని లోకేష్ చెప్పడం విడ్డూరంగా ఉదన్నారు. జగన్‌తో పోటీ పడాలంటే చేసిన అభివృద్ధిలో అమలుపరిచిన పథకాలతో పోటీ పడాలి తప్ప సంఖ్యాపరంగా కాదని సూచించారు. భారతదేశంలో మొట్టమొదటిసారిగా అమ్మబడి ప్రవేశపెట్టింది, నాంది పలికింది జగన్ ప్రభుత్వమేనని తెలుసు కోవాలన్నారు. సమావేశంలో వైసిపి మండల అధ్యక్షుడు ఉత్తమారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, సాదిక్‌బాషా, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రోత్సాహకరం

ప్రజాదృష్టి

ప్రభుత్వం ప్రొద్దుటూరును బంగారు తయారీ కేంద్రంగా మార్చుతామని ప్రకటించడం ప్రశంసనీయం. దేశంలోనే రెండవ ముంబయిగా ప్రసిద్ధిగాంచిన ప్రొద్దుటూరు పట్టణాన్ని ఎంఎస్‌ఎంఇల తరహాలో పారిశ్రామిక పట్టణంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్, డిఐసి, ఎపిఐఐసి అధికారుల సమావేశంలో ప్రణాళికలు రచించడం అపురూపం. ఇటువంటి ప్రోత్సాహకర ప్రయత్నాలు చేయడం ఉత్సాహాన్ని నింపుతోంది. జిల్లాలో జెఎస్‌డబ్ల్యూ రెండు దశల్లో రూ.తొమ్మిది వేల కోట్లతో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు చేపట్టతామని ప్రకటించడం తెలిసిందే. రాష్ట్రంలోని కూటమి సర్కారు నాయకత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది. ఇటువంటి ప్రయత్నం ద్వారా సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తే రాయలసీమ వాసులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రుణాన్ని తరాల తరబడి తీర్చుకోని రీతిలో బ్రహ్మరథం పట్టే వారని చెప్పవచ్చు. రాజకీయంగానూ టిడిపికి తిరుగులేకుండా ఉండేది. రాయలసీమ రూపురేఖలు మారిపోయి ఉండేవి. దేశంలోనే రాయల సీమ వెనుకబడి ప్రాంతమని పేరు సైతం తొలగిపోయేది. కొప్పర్తి పారిశ్రామికవాడలో ఎంఎస్‌ఎంఇ పార్కు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో సందేహం తొలగిపోయింది. రూ.250 కోట్ల వ్యయంతో దేశ పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా టెక్ విద్యార్థులను తీర్చిదిద్దడం ఆహ్వానించాల్సిన విషయమని గ్రహించాలి. రాయలసీమ నుంచి గల్ఫ్‌కు వెళ్లే వలసలను నిరోదించే అవకాశంలో మొదటి అడుగు పడేది. రెండవ అడుగు జిల్లాలో ఉక్కు పరిశ్రమ ప్రారంభమైతే వలసలు నియంత్రణలోకి వచ్చే అవకాశం ఉంటుందని చెప్ప వచ్చు. గండికోట ఆవరణంలో టెంట్‌సిటీ ఏర్పాటు చేయనుండడం ఉత్సాహాన్ని కలిగిస్తోంది. పర్యాటక ప్రాజెక్టును గ్రాండ్‌కెనాన్ తరహాలో తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. 2014-19 టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.500 కోట్లతో పర్యాటకాభివృద్ధి చేపడతామని ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. 2024-29 పీరియడ్‌లో గండికోటను గ్రాండ్‌కెనాన్ తరహాలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం, గండికోటను గ్రాండ్‌కెనాన్ తరహాలో అభివృద్ధి, ఎంఎస్‌ఎంఇ పార్కు, హార్టికల్చర్‌హబ్, ఫ్రూట్ బాస్కెట్ తీర్చిదిద్దుతామనే హామీలను అమలు చేస్తే జిల్లా ప్రజానీకం టిడిపికి బ్రహ్మ రథం పడతారనడంలో సందేహం లేదు. హామీల అమలుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాల్సిన అవసరం ఉంది. ఏటా జిల్లా పురోగతిపై సమీక్షించుకుని అభివృద్ధి వేగవంతానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి


మాట్లాడుతున్న డాక్టర్ నాగ దస్తగిరిరెడ్డి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆరోగ్యంగా జీవించాలంటే యోగా చాలా అవసరమని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ నాగ దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. యోగా ఆంధ్రప్రదేశ్-2025లో భాగంగా శనివారం ఆరోగ్య భారతి, శ్రీ సరస్వతి విద్యా మందిర్ సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యంగా జీవించాలంటే యోగా చాలా అవసరమన్నారు. వర్తమాన కాలంలో పనుల వత్తిడి, వేగం ఎక్కువ అవుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మానసిక ప్రశాంతత అవసరమన్నారు. యోగా, ధ్యానం వల్ల వస్తుందన్నారు. కార్యక్రమంలో యోగా గురువులు సుబ్బ శేఖర్, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నూతన పాలక మండలి సభ్యులు డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి, ఎల్లారెడ్డి, యోగా టీచర్లు రఘురామిరెడ్డి, స్వప్న పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ డి.రాముడు తెలిపారు. శనివారం స్థానిక ధ్యాన్‌చంద్ క్రీడా మైదానంలో కమిషనర్ ఆధ్వర్యంలో శనివారం యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ప్రశాంతత, శారీరక వ్యాయామం కలుగుతుందన్నారు. యోగా గురించి తెలుసుకుని ఆసనాలు వేయడం అలవర్చుకోవాలన్నారు. అనంతరం కొన్ని యోగా ఆసనాలు వేయించారు.

పులివెందుల రూరల్ : మానవ జీవితానికి యోగా ఎంతో అవసరం అని, యోగా చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అని, ఆరోగ్యంగా ఉండడం కోసం ప్రతి ఒక్కరూ రోజూ యోగాసనాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో యోగాభ్యాసంపై అవగాహన కార్యక్రమాన్ని వైయస్సార్ పాకే క్రీడా మైదానంలో మున్సిపల్ కమిషనర్ రాముడు అధ్యక్షత యోగా గురువు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

సింహాద్రిపురం : యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని శిక్షకులు సూర్యచంద్రారెడ్డి పేర్కొన్నారు. సింహాద్రిపురం జడ్పీ హైస్కూల్లో శనివారం యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులు తమ తల్లిదండ్రులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సతీష్ ప్రభు కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్ది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షుడు సంధ్యాల సుబ్బయ్య యాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పుల్లూరు దళితవాడలో పాఠశాలల విద్యార్థులకు తల్లికి వందనం పథకం ద్వారా నగదు జమ కావడం పట్ల సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవింద సుబ్బయ్య, కమ్మ నరసింహులు, మీసాల విజయమోహన్ పాల్గొన్నారు.

తల్లుల ఖాతాలో జమచేయడం చారిత్రాత్మక ఘట్టం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

కుటుంబంలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులందరికీ తల్లికివందనం పథకం పేరుతో తల్లి ఖాతాలో జమ చేయడం చారిత్రాత్మక ఘట్టమని టిడిపి జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లోమడ మురళీమోహన్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేష్ కుటుంబంలోని చదువుకుంటున్న పిల్లలందరికీ తల్లికివందనం పేరుతో బ్యాంకుల్లో జమ చేయడం ఎంతో సంతోషించదగ్గ పరిణామమన్నారు. పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం తల్లుల ఖాతాలో జమ చేశారన్నారు. సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు.

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని తవ్వారుపల్లెలో శ్రీవీరాంజనేయ స్వామి ఆలయ 8వ వార్షికోత్సవ సందర్భంగా శనివారం నిర్వహించిన ఎద్దుల బండ లాగుడు పోటీలు ఆకట్టుకున్నాయి. ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు గ్రామ పెద్దలు మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామపెద్దలు అన్న ప్రసాద వితరణ చేశారు. బండలాగుడు పోటీలను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ చైర్మన్ సంధుల నాగశేషారెడ్డి బండలాగుడు పోటీలను ప్రారంభించి, గెలుపొందిన వృషభాల యజమానులకు బహుమతులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

విగ్రహాలను ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - వేముల

రాయలసీమను పరిపాలించిన వారి విగ్రహాలను ఏర్పాటు చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి కేంద్ర గ్రామీణ అభివృద్ధి, టెలికం కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కోరారు. ఈ మేరకు పేర్ల పార్థసారథిరెడ్డి శనివారం విజయవాడలో మంత్రి కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ గండికోట అభివృద్ధి రాయలసీమకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

16న ధ్రువీకరణకు తుది అవకాశం

ప్రజాశక్తి - వేంపల్లి

ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటీల్లో సీటు పొందేందుకు ప్రత్యేక కేటగిరీ కింద దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 16న నూజివీడు క్యాంపస్‌లో ధ్రువీకరణ పత్రాలను పరిశీలన చేసేందుకు తుది అవకాశం కల్పించినట్లు అడ్మిషన్ కన్వీనర్ అమరేంద్ర కుమార్ సండ్ర ప్రకటనలో తెలిపారు. ఆర్జీయూకేటీ ఏపికి సంబంధించి 2025-26 విద్యాసంవత్సరానికి ఇంటిగ్రేటెడ్ బిటెక్ కోసం దరఖాస్తు గడువును 2025 జూన్ 2 నుండి 10వ తేదీ వరకు పొడిగించారన్నారు. ఆ గడువులో క్యాప్, క్రీడలు, ఎన్‌సిసి, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి ప్రత్యేక కేటగిరీలకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్ ధ్రువీకరణ కార్యక్రమాన్ని ఈనెల 16న సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు.

లక్ష గృహాలకు సోలార్ రూఫ్ టాప్ లక్ష్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జిల్లాలో లక్ష గృహాలకు సోలార్ రూఫ్ టాప్ లక్ష్యమని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్.రమణ తెలిపారు. మండల పరిధిలోని మోరగుడి గ్రామ ప్రజలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రజల సౌరశక్తి వినియోగం ప్రోత్సాహంతో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు నిర్దేశాలు సులభతరం చేశామన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు బ్యాంకర్ల సహకారాలు మెండుగా ఉన్నాయన్నారు. సిబిల్ స్కోర్ బట్టి బ్యాంకులు రుణాలు వేగవంతంగా ఇస్తారన్నారు. ఒక్క కిలో వాట్ కెపాసిటీ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే నెలకు 120 యూనిట్ల విద్యుత్, అదే రెండు కిలోవాట్ల కెపాసిటీ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే 240 యూనిట్ల ఉత్పత్తి చేస్తుందన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ పొంది సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాఘవేంద్ర, అసిస్టెంట్ ఇంజనీర్లు రజనీకాంత్ రెడ్డి, ఈశ్వర్, మోరగుడి ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాల కనీస వసతులపై దృష్టి

- సమగ్ర శిక్షణ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ నిత్యానంద రాజు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



పాఠశాలల కనీస వసతులపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించిందని, ఆ మేరకు డేటా ఇన్‌పుట్‌లో పాఠశాలల స్థితిగతులను నమోదు చేయాలని జిల్లా సమగ్ర శిక్షణ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ నిత్యానంద రాజు ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, పట్టణ ప్రాంతాలో వార్డ్ యమినిటి సెక్రటరీలకు ఆదేశాలిచ్చామని ఆయన పేర్కొన్నారు. వేముల, పులివెందుల పరిధిలోని పాఠశాలలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిత్యానంద రాజు మాట్లాడుతూ విద్యా సంవత్సరం సంబంధించి సర్వేపల్లి రాధాకృష్ణ పుస్తకాలు, ఇతర సామగ్రి అన్ని పాఠశాలల విద్యార్థులకు అందించారా లేదా అని ఆయా పాఠశాలల ప్రధా నోపా ధ్యాయులను అడిగి తెలుసుకున్నా మన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు పాఠశాలల్లో గదులు సంఖ్య పరిశీలించామన్నారు. కొత్త భవనాలు, మరమ్మతులు జరుగుతున్న పనులను తనిఖీ పరిశీలించామన్నారు.

క్రమశిక్షణ, అంకితభావంతోనే మన్ననలు


సివిఐగా రాజీనామా చేసిన ఖలీల్ సౌదాగర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - వేముల

స్థానిక యుసిఐఎల్ కంపెనీలో సబ్ కంపెనీగా ఉన్న ఎస్ఎంఎస్ కంపెనీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఖలీల్ సౌదాగర్ శనివారం ఉద్యోగానికి రాజీనామా చేసిన సందర్భంగా కంపెనీ ఉద్యోగ సిబ్బంది ఆయనకు వీడ్కోలు, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖలీల్ సౌదాగర్ సివిఐగా 15ఏళ్ల నుంచి ఎస్ఎంఎస్ కంపెనీలో బాధ్యతలు చేపట్టారన్నారు. ఎంతోమంది నిరుద్యోగులకు ఇఎస్ఎఫ్ ఉద్యోగాలు కల్పించారన్నారు. మార్గదర్శి, దానగుణం, క్రమశిక్షణ కలిగిన గొప్ప వ్యక్తిగా కంపెనీలో పేరు పొందారని కొనియాడారు. గతంలో ఆయన పులివెందులలో డిఎస్‌పిగా విధులు నిర్వర్తిస్తూ పులివెందులలో ఉద్యోగ విరమణ చేశారని గుర్తు చేశారు. అంకితభావంతో నిరంతరం కష్టపడుతూ కంపెనీకి ఎనలేని కృషి చేశారని తోటి ఉద్యోగులు ప్రశంసించారు. ప్రశాంతత కోసం, కుటుంబంతో గడపాలనే ఉద్దేశంతో ఆయన ఉద్యోగానికి రాజీనామా చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ తుమ్మలపల్లె యురేనియం లేబర్ యూనియన్ జనరల్ సెక్రటరీ లావనూరు అంకిరెడ్డి, సుగునాథరెడ్డి, ఎస్ఎంఎస్ జిఎం జిఎస్ రావు, సునీల్ రెడ్డి, గంగాధర పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలి

వేంపల్లె - వేంపల్లె

గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలు ఇచ్చి ఆదుకోవాలని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. మైలవరం మండలం వేపరాల నుండి బదిలీపై వచ్చిన ఇఒ మాధవరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇఒను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సర్పంచ్‌తో ఇఒ మాధవరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ఉన్న సమస్యలపై చర్చించారు. గత 6 నెలలుగా పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు సతమతమవుతున్నట్లు చెప్పారు. వెంటనే కార్మికులకు జీతాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు. తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టి గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మాధవరెడ్డి ఇఒగా బాధ్యతలు స్వీకరించడంతో వార్డు సభ్యులు, టిడిపి, వైసిపి, కాంగ్రెస్ నాయకులు కలిశారు. అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. అందరి సహకారంతో గ్రామ పంచాయతీని పరిశుభ్రతగా ఉండేలా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తానని ఇఒ హామీ ఇచ్చారు.


సర్పంచ్‌తో సమస్యలపై చర్చిస్తున్న ఇఒ మాధవరెడ్డి

రక్తదానం మానవత్వానికి నిదర్శనం



ఫాతిమా మెడికల్ కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది

ప్రజాశక్తి - కడప

ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఫాతిమా మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

కడప అర్బన్ : రక్తదానం అనేది కేవలం వైద్య అవసరానికే కాకుండా మానవత్వానికి నిదర్శనమని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎస్.రవిబాబు అన్నారు. శనివారం కడప స్థానిక బాలాజీ నగర్‌లో ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా జెబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జెబీవీ ఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి వ్యవస్థాపకుడు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ అశోక్, సంస్థ సభ్యులు సుమంత్, అరవింద్, నవీన్, రేవంత్, వసంత, ఇండి యన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, మేరా యువభారత్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

కడప : కడప నగరంలోని ఎస్ఏ క్యూ టెక్నాలజీస్ ఇన్స్టిట్యూట్‌లో శనివారం ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొనిప్రత్యేక రక్తదాన శిబిరం నిర్వహించారు. రాణాప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 100 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అభినందించి, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, పెద్దిరెడ్డి రఘునాథ్ రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

– అన్ని దానాల కన్నా రక్తదానం ఎంతో గొప్పది అని టిడిపి తొగట వీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు మడక చక్రధర్ అన్నారు. బృహుదా బ్లడ్ బ్యాంకులో హాండ్స్ ఫర్ యు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పట్టు పోగుల సుబ్బారావు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మడక చక్రధర్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి కడప జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు వేల్పుల సుబ్రహ్మణ్యం, డివిజన్ ఇన్‌ఛార్జి మణి భూషణ్ రెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లె : ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు రక్తదానం చేసే దాతలే నిజమైన హీరోలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రక్తదానం మహాదానమన్నారు. రక్త దాతలు సృష్టికర్తతో సమానమన్నారు. రక్తం ఇవ్వడం వల్ల దాత ఆరోగ్యం మరింత మెరుగువుతుందన్నారు. రక్త దానంపై మరింత అవగాహన అవసరమన్నారు.

పులివెందుల రూరల్ : యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతోనే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యం అవుతుంది అని రక్తనిధి మెడికల్ అధికారి డాక్టర్ రాజేశ్వరి పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పులివెందుల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రక్తనిధి కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 30 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్స్‌లు లత, అపర్ణ, రక్తనిధి కౌన్సిలర్ రజిని, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : మండలంలోని గోపవరంలో ఉన్న శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాలలో శనివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా కడప ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ డి.ఇందిరను సత్కరించారు. వీరి ప్రోత్సాహంతో కళాశాల విద్యార్థులు రక్తదానానికి ముందుకు వచ్చి 115 యూనిట్ల రక్తదానం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు నాగరాజు, రవిబాబు, జిల్లా ఉపాధి, పర్యాటక అధికారి ఏ సురేశ్ కుమార్, వైద్య అధికారి ఎం.యశస్వి రెడ్డి, జిల్లా కో-ఆర్డినేటర్ పి.సుధాకర్ పాల్గొన్నారు.

– పద్మ విభూషణ్ మెగాస్టార్ పవర్ స్టార్ ఫ్రెండ్స్ సేవా సమితి వారిని చిరంజీవి, రామ్ చరణ్, పవన్ కళ్యాణ్, పుట్టినరోజు సమయాల్లో ప్రతి సంవత్సరం మెగా ఫాన్స్ రక్తదానం చేస్తున్న సందర్భంగా జిల్లా ఆసుపత్రిలో శనివారం వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే శుభ సందర్భంగా పట్టణ చిరంజీవి యువత అధ్యక్షుడు రామారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి గోపాల్, ముఖ్యఅతిథి యోగివేమన ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ జయరాంరెడ్డి, కవిత పాల్గొన్నారు.

ప్రభుత్వంపై బురద జల్లడమే వైసిపి పని

- ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రభుత్వంపై బురద జల్లడమే వైసిపి వారికి పనిగా మారిందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తూ కేంద్ర ప్రభుత్వ సహాయంతో పోలవరం, అమరావతి పూర్తి చేయడంతోపాటు నూతన రైల్వేజోన్‌లు ఏర్పాటు చేస్తోందన్నారు. ఓర్వలేక వైసిపి నాయకులు బురదజల్లే పనిలో నిమగ్నమయ్యారని తప్పుపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫించన్లు రూ.4000 పెంచి చెప్పిన మాట ప్రకారం బకాయితో పాటు అందించిందన్నారు. మెగా డీఎస్సీ కూడా విడుదల చేసిందన్నారు. తల్లికివందనం ఎంత మంది పిల్లలుంటే అంతమందికి అమలు చేసిందని వివరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జంబాపురం రామాంజనేయ రెడ్డి, టిడిపి నాయకులు పోసా భాస్కర్, గాలి పోతుల సుదర్శన్ పాల్గొన్నారు.

తల్లికి వందనంపై తప్పుడు ప్రచారం తగదు

- టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తల్లికివందనం పథకంపై వైసిపి బులుగు విషం కక్కుతోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికివందనం పథకంలో ఒక్కో విద్యార్థికి రూ.15వేలు ప్రభుత్వం ఇస్తా ఉంటే వైసిపి నేతలు తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. రూ.2000 లోకేష్ జోబులోకి పోయాయంటూ దిగజారుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. వైసిపి పాలనలో రూ.13వేలు ఇచ్చి మిగతా రూ.2,000 జగన్ జోబుల్లోకి పోయాయా లేదా తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయా అని ప్రశ్నించారు. జగన్ పాలనలో 42 లక్షల మందికి అమ్మఒడి ఇస్తే, కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికివందనం ఇస్తోందన్నారు. సమావేశంలో యూత్ నాగేశ్వర్‌రెడ్డి, జంబాపురం వెంకటరమణారెడ్డి, పొన్నతోట శీను, నాగేంద్ర, దువ్వూరు మురళి, పాలూరు సుధీర్‌రెడ్డి, మోరగుడి విశ్వనాథరెడ్డి, కూటమి నేతలు పాల్గొన్నారు.

పంటల సాగుతో రైతుకు ఆదాయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రకృతి వ్యవసాయం విధానంలో ప్రధాన పంటతోపాటు పలు రకాల అంతర పంటలు, బయో డైవర్సిటీ పంటలు వేయడం వల్ల రైతుకు ఆదాయంతోపాటు నేలలోని సూక్ష్మజీవులకు సరైన పోషకాహారం అందుతుందని డిపిపి కరీమున్నీసా తెలిపారు. శనివారం మండల పరిధిలోని పి.బొమ్మేపల్లి, అంబవరం గ్రామాల్లో పనిచేస్తున్న మెంటార్ ఇంటర్న్, మెంటార్ పొలాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జనవరి నుండి మే వరకు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్వయంగా ఫీల్డ్‌లోకి వెళ్లి ఏటీఎం, ఏ గ్రేడ్‌లలో ఉన్న పంటలను పరిశీలించారు. పర్యవేక్షణలో వైఆర్ఎఫ్ మహేశ్వరి, బొమ్మేపల్లి మెంటార్ ఇంటర్న్ పి.నాగరాజు, అంబవరం మెంటార్ ఎన్.లక్ష్మీదేవి, పెద్దముడియం మండలం ఫార్మర్ సైంటిస్టులు సురేష్, నాగ పుల్లయ్య పాల్గొన్నారు.


పి.బొమ్మేపల్లిలో పంటను పరిశీలిస్తున్న కరిమున్నీసా, మహేశ్వరి

స్కూల్ జోన్ వద్ద జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలి

- విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్

ప్రొద్దుటూరు పట్టణంలోని మోడం పల్లె బైపాస్‌లో శ్రీచైతన్య హైస్కూల్ పక్కన ఉన్న ఎర్రగుంట్ల రోడ్డులో విద్యార్థులు, వృద్ధులు తిరుగుతూ ఉంటారని, ఆయా ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలని పిఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు కత్తి, యన్‌డిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, నేషనల్ ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎరుకల ప్రసాద్ ఆర్అండ్‌బి అధికారులను కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థి యువజన నాయకులు అశోక్, రాజు పాల్గొన్నారు.


కాలువలను శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ పెద్దిరెడ్డి

కాలువల్లో పూడికతీత పనులు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఇటీవల కాలంగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో ఆంజనేయ కొట్టాల పంచాయతీ ప్రజలు మురుగుతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటుండేవారు. అంటువ్యాధులు సోకే ఆస్కారం ఉండడంతో భయాందోళన చెందేవారు. మురుగునీరు నిల్వ కారణంగా దోమల బెడద ఎక్కువగా ఉండేది. ప్రజలు పడుతున్న సమస్యలను గుర్తించిన గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి శనివారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. వెంకట రామాపురం గ్రామంలో పూడికతో నిండిపోయిన మురుగు కాలువలను శుభ్రం చేయించే చర్యలు తీసుకున్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయించారు. పంచాయతీ పరిశుభ్రంగా ఉండాలన్నదే తన లక్ష్యమని సర్పంచ్ పెద్దిరెడ్డి తెలిపారు.

బేషరతుగా అమలు చేయాలి

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వం విద్యార్థుల చదువులకు ఇస్తున్న తల్లికివందనం పథకంలో కోతలు కోయవద్దని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి సూచించారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తల్లికివందనం హామీని అమలు చేయడం హర్షణీయమన్నారు. ఆ పథకానికి పెట్టిన షరతులు, నిబంధనలతో దాదాపు 9 లక్షల మంది విద్యార్థులు అర్హతను కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి షరతులతో నిమిత్తం లేకుండా తల్లికివందనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికుల పిల్లలకు షరతులు లేకుండా అమలు చేయాలని కోరారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ పొందే కుటుంబాలలోని విద్యార్థులకు వర్తించకపోవడం సమంజసం కాదన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ ఉన్నత విద్యకు, తల్లికివందనం పాఠశాల, ఇంటర్ విద్యకు సంబంధించిందని తెలిపారు. ఈ రెండింటికి ముడి పెట్టడం సరికాదన్నారు.

20 నుంచి పాలిసెట్-25 కౌన్సెలింగ్

ప్రజాశక్తి - చాపాడు

పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూలును ఎపి సాంకేతిక విద్యాశాఖ వెల్లడించిందని మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం ఈనెల 20 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభంకానుందని తెలిపారు. కౌన్సిలింగ్‌కు సంబంధించిన ప్రాసెసింగ్ ఫీజును ఆన్‌లైన్ విధానంలో చెల్లించడానికి ఈనెల 20 నుండి 27వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు. ఫీజు ఓసి, బిసిలకు రూ.700, ఎస్సీ, ఎస్టీలకు రూ.250 చెల్లించాలన్నారు. పాలిసెట్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టనున్నారన్నారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఫీజు చెల్లించిన రశీదు, పాలిసెట్ హాల్ టిక్కెట్, ర్యాంక్ కార్డు, పదో తరగతి ఉత్తీర్ణత ధృవపత్రం, బదిలీ ధృవపత్రం, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, అర్హులైన వారికి ఇడబ్ల్యుఎస్, ఆదాయ ధృవపత్రం, ప్రత్యేక కేటగిరీ పత్రాలను సమర్పించాలన్నారు. ఈనెల 25 నుంచి జూన్ 30వ తేదీ వరకు కోర్సులు, కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించారన్నారు. వెబ్ ఆప్షన్లను మార్చుకునేందుకు గడువును జూలై ఒకటిగా నిర్ణయించారని, జూలై 3న సీట్లను కేటాయించనున్నారన్నారని ఆయన వివరించారు. సీట్లు పొందిన అభ్యర్థులు సంబంధిత కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ లేదా ఆన్‌లైన్ విధానం ద్వారా రిపోర్టు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని విద్యుత్ వినియోగదారులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సోమవారం సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు మైదుకూరు సబ్ డివిజన్ డిఇఇ జె.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ గతంలో పనిచేసిన విద్యుత్ అధికారి మోసపూరిత చర్యలతో చాలా మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చాలా రోజులుగా ఎదురుచూస్తున్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు స్థానిక విద్యుత్ ఉపకేంద్రం వద్ద సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు వినతులు స్వీకరిస్తామని చెప్పారు. న్యాయపరమైన సమస్యలకు కల్గిన నష్టానికి తగిన న్యాయం జరుగుతుందని ఆయన వివరించారు.


హెల్త్ సెంటర్‌కు తాళం వేసి ఉందని చూపిస్తున్న ఎమ్మెల్యే 'పుట్టా'

హెల్త్ సెంటర్ సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ కృష్ణాపురం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ శనివారం అకస్మిక తనిఖీ చేశారు. హెల్త్ సెంటర్‌కు తాళాలు వేసి ఉండడంతో డాక్టర్, సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఎంహెచ్ఒకు ఫోన్‌లో వెంటనే చర్యలు తీసుకుని సంబంధిత సిబ్బందిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. రక్త సేకరణ పరికరాలను హాస్పిటల్ ఆవరణలో ఉండడాన్ని గమనించారు. ప్రజల సౌకర్యం కోసం ఇక్కడ పెడితే సిబ్బంది ఇలాగా చేసేదంటూ ఎమ్మెల్యే అగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్ళారు. కార్యక్ర మంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎపి రవీంద్ర, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు భీమయ్య, నాయకులు నాగమోహన్, వైవి సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.